క్లుప్తంగా

తెనాలిలో రెండు నామినేషన్లు

తెనాలిరూరల్‌: నామినేషన్ల ప్రక్రియలో భాగంగా సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో రెండు నామపత్రాలు దాఖలయ్యాయి. కాంగ్రెస్ పార్టీ తరఫున సినీ నిర్మాత, వ్యాపారి షేక్ బషీర్ తమ అభ్యర్థిత్వ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ నుంచి తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థిగా అమానుల్లా నామినేషన్ దాఖలు చేశారు.

క్రికెట్ పిచ్ ధ్వంసం



తెనాలి: నాజరుపేటలో లూథరన్ అప్పర్ ప్రైమరీ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్‌లోని క్రికెట్ పిచ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. పిచ్ ధ్వంసంతోపాటు ఫ్లెక్సీలను చించేశారని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులైనవారిపై తగిన చర్యలు తీసుకోవాలని శిక్షకుడు దేవరపల్లి జాన్సన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యం

కొల్లిపర: గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని పోలీసులు సోమవారం గుర్తించారు. మండలంలోని తూములూరు–దావులూరు గ్రామ పొలిమేర డొంకకి ఎదురుగా ఉన్న రేపల్లె కాలువలో 40– 50 ఏళ్ల మధ్య వయస్కుడి మృత దేహాన్ని గుర్తించారు. మృతుడి కుడి చేతికి దారముతో పేనిన ఆరెంజ్ రంగు మణికట్టు బ్యాండ్, తెల్లటి ముత్యపు ఉంగరము, సాయిబాబా ఉంగరము ఉన్నాయని ఎస్‌ఐ ఆర్ రవీంద్రరెడ్డి తెలిపారు. సమాచారానికై కొల్లిపర,తెనాలి గ్రామీణ పోలీస్ ఠాణాను సంప్రదించాలని తెలిపారు. మృత దేహన్ని తెనాలి వైద్యశాలకు తరలించినట్లు ఎస్ ఐ చెప్పారు.

మజ్జిగ పంపిణీ.

తెనాలిఅర్బన్‌: ప్రజల దాహార్తిని తీర్చేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు ధరణికోట మల్లి ఆధ్వర్యంలో బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ తెనాలి పట్టణ క్లస్టర్–1 అధ్యక్షుడు మద్దాలి శేషాచలం, పట్టణ ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావులు ప్రారంభించి పాదచారులకు మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి తీవ్రత నేపథ్యంలో వాహనదారులు, పాదచారులకు మజ్జిగను పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కిరణ్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సీపీఐఎంఎల్ లిబరేషన్ అభ్యర్థిగా శావల గోపాల్



తెనాలి: ప్రథమ సోషలిస్టు రాజ్య నిర్మాత లెనిన్ జయంతి, సీపీఐఎంఎల్ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి రాందేవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ సీపీఐఎంఎల్ లిబరేషన్ అభ్యర్థిగా శావల గోపాల్‌ను ప్రకటించారు. రాష్ట్ర కమిటి సభ్యుడు లోకం భాస్కరరావు, జిల్లా కమిటీ సభ్యులు కుంచకర కోటేశ్వరరావు, కనపర్తి మధుకర్, సుబ్బయ్య, బెన్‌హర్, దిలీప్, ఖాశింసాహెబ్, ఇస్మాయిల్, లక్ష్మీ నారాయణ, వీరయ్య, రహీమ్ పాల్గొన్నారు.

లాడ్జిల్లో వ్యభిచారం నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్‌: లాడ్జిల్లో వ్యభిచారం నిర్వహిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. తెనాలి మూడో పట్టణ సీఐ ఎస్. రమేష్ బాబు, సిబ్బంది సర్కిల్ పరిధిలోని లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించి పట్టణానికి చెందిన శ్రీనివాస్ ను అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

అనధికార నిర్మాణాలను గుర్తించాలి

తాడేపల్లిరూరల్‌: నగరపాలక సంస్థ పరిధిలోని అనధికార నిర్మాణాలను వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ ఆదేశించారు. సోమవారం తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయంలో ప్లానింగ్ సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో అనధికార కట్టడాలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని, అనధికార హోర్డింగ్‌లు, అభ్యంతరకరమైన ఆక్రమణలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలను గుర్తించి వారికి నోటీసులు అందజేయాలని, ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించాలని, అగ్ని భద్రతా చర్యలు లేని భవనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి సచివాలయ సిబ్బంది సంబంధిత రిజిష్టర్లను, రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని వివరించారు. సమావేశంలో డి.సి.పి. అశోక్ కుమార్, టీపీఓ రమేష్‌బాబు పాల్గొన్నారు.

సంక్షేమ విప్లవం...

సీఎం జగన్‌తోనే సాకారం

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్
- పట్టణంలోని 15, 14, 13, 12, 7 వార్డుల్లో జోరుగా ఎన్నికల ప్రచారం
- నీరాజనాలు పలికిన మహిళలు, స్థానికులు



ఎమ్మెల్యే అభ్యర్థి శివ కుమార్‌ను పనసకాయల దండతో సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, కుటుంబ సభ్యులు

తెనాలిఅర్బన్‌: రాష్ట్రంలో సంక్షేమ విప్లవానికి నాంది పలికిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్‌సీపీ తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని 15వ వార్డులో సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయనకు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, గుంటూరు గోపి, పసిలు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి వార్డులోని పలు వీధుల్లో రోడ్డు షో నిర్వహించారు. మహిళలు, స్థానికులు స్వచ్ఛందంగా బయటకు వచ్చి పూల వర్షం కురిపించి హారతులిచ్చారు. శివకుమార్‌కు పనసకాయ దండతో సన్మానించారు. అనంతరం చినరావూరు పార్కు సమీపంలో 13వ వార్డు కౌన్సిలర్ కుర్రా సుజాత, కుర్రా శ్రీను దంపతులు శివకుమార్‌కు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి వార్డులోని పలు వీధుల్లో రోడ్డు షో నిర్వహించారు. అక్కడి నుంచి 12వ వార్డుకు రోడ్డు షో చేరుకోవడంతో కౌన్సిలర్ కొర్రి యశోద, దేవరపల్లి కిషోర్, తదితరులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి పలు వీధుల్లో రోడ్డు షో నిర్వహించారు. 14వ వార్డు చేరుకోగానే కౌన్సిలర్ దాసరి వీరవసంతరావు, మన్నవ ప్రభాకర్‌లు ఆయనకు ఘన స్వాగతం పలికారు. వీధుల్లో రోడ్డు షో నిర్వహించి ఏడో వార్డుకు చేరుకున్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, ఆర్యవైశ్య నాయకులు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి వీధుల్లో మహిళలు బయటకు వచ్చి శివకుమార్‌కు అభినందనలు తెలిపారు.

మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ తెనాలి నియోజకవర్గ పరిశీలకులు మండపాటి శేషగిరిరావు, కౌన్సిలర్ యాతాటి అనిల్, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభానీ, పార్టీ నాయకులు బొమ్ము నాగిరెడ్డి, టెక్స్ బాల, గొర్రెపాటి వేణుగోపాల్‌రెడ్డి, కావేటి నిర్మల, అక్కిదాసు కిరణ్‌కుమార్, వేజండ్ల శ్రీకాంత్, గోల్డ్ రేహామా, కాకిదేవ సహాయం, కుక్కల ముక్తేశ్వరరావు, రెడ్డిరౌతు బాలరాజు, ఎం.ప్రభాకర్, పెసర్లంక రమణ, కావేటి ఈశ్వరరావు, తట్టుకుళ్ళ అశోక్‌యాదవ్, అత్తోట అమృతరాజు, తాడిబోయిన పోలురాజు, శానంపూడి రఘురామిరెడ్డి, చుండూరు సాయి, చుక్కా ఆనంద్, చుండూరు వెంకటేశ్వరరావు, ఉన్నవ చంద్రశేఖరరావు, టోపీ సుభానీ, కాళిదాసు వెంకటేశ్వరరావు, పిల్లి వీరయ్య, పిల్లి ప్రేమ్‌రాజు, ధరణికోట మల్లి, పెరుగు పెద్దబాబు, పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ప్రచారంలో శివకుమార్‌పై పూలవర్షం కురిపిస్తున్న 15వవార్డు మహిళలు



ప్రజలకు అభివాదం చేస్తున్న అన్నాబత్తుని శివకుమార్

పెట్రోలుకు టోకెన్లు.. మందుకు డబ్బులు

- టీడీపీ అభ్యర్థి నామినేషన్ లో కార్యకర్తలు, ప్రజలకు ఎర
- పూటుగా తాగారు.. తూగుతూ తన్నుకున్నారు
- టీడీపీ కార్యకర్తల చేష్టలపై సర్వత్రా పెదవివిరుపు



టోకెన్లు పట్టుకుని ప్రత్తిపాడు పెట్రోలు బంకు వద్ద వేచి ఉన్న ద్వి చక్ర వాహనదారులు

ప్రత్తిపాడు: తన నామినేషన్ కోసం వచ్చే కార్యకర్తలు, ప్రజలకు టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు తనదైన శైలిలో ఎరవేశారు. వెంట వాహనాలతో వచ్చేవారికి ఉచితంగా పెట్రోలు, డీజిలు కొట్టేందుకు మద్యాన్ని పంపిణీ చేశారు. ఇది చాలక వచ్చినవారందరికీ డబ్బులిచ్చి ర్యాలీగా బయలుదేరారు. కారుకు రూ. 500, ద్విచక్రవాహనానికైతే రూ. 150 చొప్పున పెట్రోలు నింపారు. ఇందుకోసం ముందుగానే పార్టీ నాయకుల ద్వారా బంకుల వద్ద టోకెన్లు పంపిణీ చేశారు. దీంతో స్థానిక పెట్రోలు బంకు వద్ద వందల ద్విచక్రవాహనాలు బారులు తీరాయి. అయితే ఒక దశలో ఆలస్యం కావడంతో ఆగ్రహానికి గురైన టీడీపీ, జనసేన శ్రేణులు టోకెన్లను చించి దుర్భాషలాడుతూ వెళ్లిపోయారు. అదేవిధంగా మద్యం కొనుక్కోవడానికి డబ్బుల్ని పంపిణీ చేశారు. మద్యం కావాల్సిన వారిని ప్రత్తిపాడుకు తరలించారు. తీరా పూటుగా తాగి నడి రోడ్డుపై నానాయాగీ చేశారు. అలాగే గుంటూరు నగరం నుంచి తీసుకువచ్చిన కూలీలకు రూ. 550తో పాటు బిర్యానీ ఏర్పాటు చేయించారు. స్థానిక టీడీపీ కార్యాలయావరణలో ఏర్పాట్లు చేశారు. అయితే వచ్చినవారిలో సగం మంది తాయిలాలు అందుకున్న తర్వాత ర్యాలీలో పాల్గొనకుండా చల్లగా జారుకోవడం విశేషం.

టీడీపీ, జనసేనకు గుడ్ బై

ఎమ్మెల్యే శివకుమార్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన పెదరావూరు కార్యకర్తలు

తెనాలి: ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నామినేషన్ దాఖలుకు సన్నద్ధమవుతోన్న తరుణాన ప్రజాదరణ నానాటికీ పెరుగుతోంది. టీడీపీ, జనసేనకు చెందిన కార్యకర్తలు, నాయకులు వైఎస్సార్ సీపీ గూటికి చేరుతున్నారు. ఈ క్రమంలో రూరల్ మండలం పెదరావూరుకు చెందిన సయ్యద్ మమబూబ్ ఆధ్వర్యంలో ఆదే గ్రామంలోని టీడీపీ, జనసేనకు చెందిన కంచర్ల మధుశేఖర్, ఆయన మిత్రబృందం వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం రాత్రి వీరంతా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలను కప్పి ఎమ్మెల్యే స్వాగతం పలికారు. ప్రస్తుత ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా కంచర్ల మధుశేఖర్ తదితరులు మాట్లాడుతూ, సంక్షేమ పాలనతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పేద, మధ్యతరగతి వర్గాల జీవన ప్రమాణాలను పెంపొందించారని ప్రశంసించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా తెనాలి పట్టణంలో 20 వేల మందికి పైగా పేదలకు ఇళ్లస్థలాల పట్టాలను, రిజిస్ట్రేషను పత్రాలతో అందించటం గొప్ప విషయమన్నారు. పేద, మధ్యతరగతి వర్గాలకు ఇంతగా మేలుచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అధికారం కట్టబెడతామన్నారు. తెనాలి నుంచి అన్నాబత్తుని శివకుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు.

ఘనంగా ప్రపంచ ధరిత్రి దినోత్సవం



మొక్కలు నాటుతున్న ట్రస్ట్ నిర్వాహకులు

తాడేపల్లిరూరల్‌: పట్టణ పరిధిలోని సీతానగరం జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న జీయర్‌స్వామి మంగళాశాసనాలతో ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా ఆశ్రమం పరిసర ప్రాంతాల్లో జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మరియు వికాస తరంగిణి సంయుక్తంగా వివిధ రకాల మొక్కలు నాటినట్లు తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి మహిళా కార్యకర్తలు వేద విద్యార్థులు పాల్గొన్నారు.

80 శాతం 'స్వీప్' చేద్దాం

తెనాలి : స్వీప్ లో భాగంగా కొత్తగా ఓటు నమోదు చేసుకున్న యువతీ యువకుల నుంచి ఓటు కలిగిన పౌరులంతా విధిగా ఓటేయాలని కోరుతూ తెనాలి సబ్‌కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ప్రఖర్‌జైన్ పట్టణంలో స్వీప్ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. మున్సిపల్, రెవిన్యూ తదితర ప్రభుత్వ శాఖలతో కలిసి మే 13న జరగనున్న ఎన్నికల్లో 80 శాతం పైగా పోలింగ్ నమోదయ్యేలా ప్రజల్లో వినూత్న అవగాహన కల్పిస్తున్నారు. 'ఓటు హక్కును వినియోగించుకుందాం ...ధర్మబద్ధమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించుకుందాం' అంటూ రకరకాల ప్రచారాలను చేపడుతున్నారు.ప్రత్యేకంగా 'బ్యాలెట్' పేరుతో లఘుచిత్రాన్ని నిర్మించి ప్రదర్శిస్తున్నారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సహా పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాత్రధారులు కావటం విశేషం. ఇలా పలు ప్రచార/అవగాహన కార్యక్రమాలతో ఓటు విలువపై చైతన్యం కల్పిస్తున్నారు.



ఓటు హక్కు ప్రచార ర్యాలీ



వయోజనులతో ఓటు ఆవశ్యకతపై ప్లకార్డుల ప్రదర్శన



ఎడ్లబండిపై సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్, అధికారుల ప్రదర్శన



రోడ్డుపై 'స్వీప్'లోగోతో మహిళల ప్రచారం



ఓటు ఆవశ్యకతపై లఘుచిత్రం 'బ్యాలెట్'

ప్రభుత్వ విద్యార్థుల విజయ దుందుభి

పది ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలలు

తెనాలిఅర్బన్‌: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారు. తెనాలి పట్టణ, మండల పరిధిలోని 16 పాఠశాలలో 69.6 శాతం ఉత్తీర్ణత నమోదైంది. తెనాలి కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలుర పాఠశాల విద్యార్థి జి.హర్షవర్ధన్ 582 మార్కులు సాధించాడు. ఖాజీపేటకు చెందిన జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని పసుపులేటి రాధాచంద్రిక 570 మార్కులు సాధించారు. విద్యార్థులను ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.



ప్రథమస్థానంలో నిలిచిన హర్షవర్ధన్‌ను అభినందిస్తున్న ఎంఈవో లక్ష్మీనారాయణ, హెచ్ఎం మౌలాలి



అధిక మార్కులు సాధించిన విద్యార్థులతో బాయ్స్ హైస్కూల్ ఉపాధ్యాయులు

కొల్లిపర మండలంలో తొలి మూడు స్థానాలూ ప్రభుత్వ విద్యార్థులవే...



యర్రు లక్ష్మీ పూజిత



కె. వివేక్



ఎస్.శ్రీచైతన్య

కొల్లిపర: పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరిశారు. కొల్లిపర మండలంలో 382మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా ..363 మంది ఉత్తీర్ణులయ్యారు. 95 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖాధికారులు జి సాల్మాన్ రాజ్, కె.ఝాన్సీలత తెలిపారు. ఈ సారి ప్రభుత్వ బడుల్లో చదివిన వారే మండల స్థాయిలో ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఆరు ప్రభుత్వ పాఠశాలల్లో 296 మంది పరీక్షలు వ్రాయగా వీరిలో 278 మంది పాసయ్యారు. మున్నంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శతశాతం ఉత్తీర్ణత నమోదైంది. అత్తోట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వై. లక్ష్మీపూజిత 576 మార్కులతో మండలస్థాయిలో టాపర్ గా నిలిచింది. మున్నంగి జెడ్పీ ఉన్నత పాఠశాల కు చెందిన కె. వివేక్ 575, ఎస్.శ్రీచైతన్య 573మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించారు. ఈ ఫలితాలు మునుముందు కాలానికి మరింత ప్రేరణగా నిలుస్తాయని విద్యాశాఖాధికారులు తెలిపారు.

జిల్లా పరిషత్ విద్యార్థుల హవా...



తన్మయి (578)



తన్విత (577)

తెనాలి రూరల్‌: పదో తరగతి ఫలితాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు రాణించారు. గతం కంటే మెరుగైన ఫలితాలను సాధించారు. పెదరావూరు జెడ్పీ హైస్కూలు విద్యార్థిని రాచకొండ తన్మయ 578 మార్కులతో మండలంలోని జెడ్పీ హైస్కూళ్ల విద్యార్థుల్లో మొదటి స్థానంలో నిలిచింది. నందివెలుగు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని టి. తన్విత 577 మార్కులతో రెండో స్థానం సాధించింది. తెనాలి మండలంలో మొత్తం ఎనిమిది జెడ్పీ హైస్కూళ్లు ఉన్నాయి. 569 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా 385 మంది ఉత్తీర్ణులయ్యారు. మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలల వారీ ఫలితాలిలా ఉన్నాయి. అంగలకుదురు 86 మందికి 73, కొలకలూరు 89కు 47, ఖాజీపేట 40 కి 33, పెదరావూరు 121 మందికి 74, సంగం జాగర్లమూడి 125కు 84, నందివెలుగు 31కు 27, కఠెవరం 45 కు 26, బుర్రిపాలెం 32కు 21 మంది పాసయ్యారు.

ప్రైవేటు విద్యాసంస్థల జైత్రయాత్ర

తెనాలి: పదో తరగతి ఫలితాల్లో వివేక విద్యాసంస్థల విద్యార్థిని ఎం.రత్నశ్రీ 592 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ప్రతిభను చాటినట్లు 'వివేక' డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ చెప్పారు. పి.శివ శంకరరెడ్డి, ఎ.చరణ్‌తేజలు 590 మార్కులు సాధించారని తెలిపారు. సోమవారం సాయంత్రం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అభినందించారు. నూరుశాతం ఉత్తీర్ణతను సాధించగా..172 మంది 500 పైగా మార్కులు, 86 మంది 550 పైగా మార్కులు, 580 పైగా మార్కులను పదిమంది సాధించారు.

తెనాలి అర్బన్ : బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి ఇంగ్లిషు మీడియం స్కూల్‌కు చెందిన పోలిశెట్టి నవ్య 584 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ జేమ్స్ మోర్లే తెలిపారు. తమ పాఠశాల నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు.

- బస్టాండ్ సమీపంలోని డాక్టర్ కెకెఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థి పాటిబండ్ల ప్రభాకర్ 596 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారని ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు, తెలిపారు. అలాగే కె.నేహ జ్యోషిత 592, కె.లారా 591 మార్కులు సాధించినట్లు చెప్పారు.
- నందులపేటలోని నాగార్జున స్కూల్ విద్యార్థి బి.జశ్వంత్ 577 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈటీ కాలనీలో ఆక్స్‌ఫర్డ్ కాన్సెప్ట్ విద్యార్థి పి.సత్య సాయి మనోజ్ఞ ధాత్రి 588 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ ఎస్.థామస్ రెడ్డి తెలిపారు.
- శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులు పది ఫలితాల్లో విజయఢంకా మ్రోగించారు. హర్షిణి 594, నందిత 593, అనన్య, రఫా ఫాతిమాలు 592 మార్కులతో ప్రథమస్థానంలో నిలిచారని ప్రిన్సిపాళ్లు మాధురి, పద్మవాణి, రాధా, లక్ష్మీపతిలు తెలిపారు. అత్యాధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తన కార్యాలయంలో అభినందించారు.



చైతన్య స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్



విద్యార్థులతో మురళీకాంత్



అధిక మార్కులు సాధించిన విద్యార్థులతో యాజమాన్యం

నెహ్రూనికేతన్ విద్యార్థుల ప్రతిభ

తెనాలి: పదోతరగతి పరీక్షల్లో స్థానిక నెహ్రూ నికేతన్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించినట్లు మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్ తెలిపారు. పరీక్షకు హాజరైన 79 మంది ఉత్తీర్ణులు కాగా, వీరిలో 43 మంది 500 పైగా మార్కులు సాధించినట్లు తెలిపారు. ఎం.లక్ష్మీనాగ వెంకట చైతన్య 594 మార్కులతో టాపర్‌గా నిలిచినట్లు చెప్పారు. అభినందనసభలో విద్యార్థులకు జ్ఞాపికలను బహూకరించారు.

26లోగా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

తాడేపల్లిరూరల్‌: మంగళగిరి నియోజకవర్గంలో ఎన్నికల విధుల ఉత్తర్వులు అందుకున్న ప్రిసైడింగ్ అధికారులు, ఇతరులు ఫారం 12 అప్లికేషన్‌ను ఈనెల 26వ తేదీలోగా అందజేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజకుమారి కోరారు. సోమవారం మంగళగిరిలోని ఆమె కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల విధుల ఉత్తర్వులు అందుకున్న ప్రిసైడింగ్ అధికారులు,ఇ తర పోలింగ్ అధికారులు, పోలీసులు, సెక్టార్ అధికారులు, బూత్ లెవల్ అధికారులు, డ్రైవర్లు, క్లీనర్లు, వీడియో గ్రాఫర్లు, బందోబస్తు కొరకు ఉత్తర్వులు అందుకున్న ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, మాజీ సర్వీస్ మెన్ ఇతర యూనిఫాం సర్వీస్‌ల వారు పనిచేస్తున్న జిల్లాలోనే సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రెండు ఫారం 12 అప్లికేషన్‌లను(ఒకటి పార్లమెంట్‌కు, రెండోవది అసెంబ్లీకి) ఎన్నికల విధుల నియామక ఉత్తర్వులు మరియు ఓటరు కార్డు ప్రతిని జతపరచి ఈనెల 26వ తేదీలోగా సమర్పించాలని, ఓటు వేయడానికి ఆఖరి తేది మే 8వ తేదీ అని, ఈ ఫెసిలిటేషన్ వివరాలను ఎన్నికలలో పోటీ చేయు అభ్యర్థులకు, రాజకీయ పార్టీ ప్రతినిధులకు ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగులకు ముందుగానే సమాచారం అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

మోదీ మోసగాళ్లకే మోసగాడు

తాడేపల్లిరూరల్‌: చంద్రబాబు మోసగాడైతే మోదీ మోసగాళ్లకే మోసగాడు అని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు పేర్కొన్నారు. సోమవారం మంగళగిరి అసెంబ్లీ స్థానానికి ఆ పార్టీ అభ్యర్థిగా జొన్నా శివశంకర్ నామినేషన్ వేశారు. ఈసందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ లౌకికత్వాన్ని కాపాడాలంటే బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు.